సాక్షి శ్రీకాకుళం

శనివారం । 31 । మే । 2025



బెట్టింగ్ మాఫియా గుట్టురట్టు

బెట్టింగ్ మాఫియా గుట్టు రట్టయ్యింది. టాస్క్‌ఫోర్స్ సాయంతో రాకెట్‌ను ఛేదించారు.

- 10లో



సోకు టీడీపీ నాయకుడిది!

ఆలయ నిర్మాణంలో ధర్మకర్తనంటూ ఓ టీడీపీ నేత ప్రచారం చేసుకుంటున్నాడు. దాతలు మండిపడుతున్నారు.

- 10లో

సినిమా థియేటర్ల తనిఖీ

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని ఎల్ మ్యాక్స్ థియేటర్, తోటవీధిలో ఉన్న పూర్ణా థియేటర్లను తహసీల్దార్ వెంకటరావు గురువారం రాత్రి తనిఖీ చేశారు. థియేటర్ల లైసెన్సు పత్రాలు, ప్రేక్షకులకు గల సౌకర్యాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, తినుబండారాలు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్‌రీల్

జూన్ 4న 'వెన్నుపోటు దినం'

- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసి, ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ఆ బాధలను ప్రజల తరఫున వెల్లడించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జూన్ 4న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'వెన్నుపోటు దినం' నిర్వహించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీలుగా వెళ్లి కలెక్టర్లకు, నియోజకవర్గ స్థాయి అధికారులకు జూన్ 4న మెమొరాండం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇది ప్రజలతో ఉన్న మమకారాన్ని చాటే సమయం, అన్ని వర్గాల సమస్యలకు అండగా నిలవాల్సిన సందర్భమని అన్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని కృష్ణదాస్ కోరారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



పార్టీ నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. శుక్రవారం ధర్మాన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలోనే ఎక్కడికక్కడే వ్యతిరేకత వస్తోందన్నారు. ముందుగా ఏడురోడ్ల జంక్షన్ నుంచి డేఅండ్‌నైట్ మీదుగా జన సమూహంతో ర్యాలీగా వెళ్లి కూటమి చేసిన మోసంపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వాలన్నారు. పార్టీ అప్పగించిన పదవుల మేరకు వారివారి విభాగాలను కలుపుకుంటూ అందరితో కలిసి సమావేశాలు నిర్వహించాలన్నారు. గార, రూరల్ ప్రాంతంతో పాటు ప్రతి డివిజన్ నుంచి అధిక సంఖ్యలో జనాలు వచ్చేలా పార్టీ నేతలు చూసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలనపై వ్యతిరేకంగా ఉన్నవారిని సంప్రదించి వారు కూడా ర్యాలీలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేవలం రెండున్నర గంటల్లో..



ఆనందం వ్యక్తం చేస్తున్న పినకాన ప్రభావతి

పలాస మండలం చినంచల గ్రామానికి చెందిన పినకాన ప్రభావతి దంపతులు 2023 జూలై 19న రేషన్ కార్డు కోసం చినంచల సచివాలయానికి వెళ్లారు. జగనన్న సురక్షలో భాగంగా భార్యాభర్తల ఆధార్‌కార్డులు జిరాక్సులు సమర్పించి రేషన్ కార్డుకు ఉదయం 10 : 30 నిమిషాలకు దరఖాస్తు చేసుకున్నారు. అదే రోజు 1 : 17 నిమిషాలకు జరిగిన సురక్షా కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. కేవలం దరఖాస్తు చేసుకున్న రెండున్నర గంటల్లో సచివాలయం నుంచి ఎమినిటీ, వీఆర్‌ఓ, ఆర్‌ఐలను దాటుకుని మండల సివిల్ సప్లైకు చేరింది. డీటీ నుంచి తిరిగి సచివాలయానికి రేషన్‌కార్డు నంబర్ క్రియేట్ అయ్యి రేషన్ కార్డు మంజూరైంది. ఈ ప్రక్రియ కోసం పైసా కూడా ఎవరూ తీసుకోలేదు.

జగన్ హయాంలో..

ఇది వైఎస్ జగన్ సర్కారు సృష్టించిన విప్లవానికి ఓ మచ్చుతునక

– కాశీబుగ్గ



ఎంత తేడా బాబూ!

సర్వర్ డౌన్.. అంతా పరేషాన్

రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు.. కొత్త రేషన్ కార్డుల నమోదు అంటూ ఊదరగొట్టింది కూటమి ప్రభుత్వం. ఇప్పటి వరకు ఎప్పుడు సచివాలయానికి వెళ్లినా సర్వర్ డౌన్.. వెబ్‌సైట్ నాట్ ఓపెన్.. చాలా వరకు ఇవే సమాధానాలు వినిపించాయి. ఈకేవైసీ విషయానికొస్తే చుక్కలు కనబడుతున్నాయి. వేలి ముద్రలు పడడం లేదు. నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉండి.. పనులు ముందుకు సాగడం లేదని లబ్ధిదారులు వాపోతున్న విషయం ఇటీవల 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. ఇదీ కూటమి ప్రభుత్వం ప్రజల సౌకర్యాలపై చూపిస్తున్న శ్రద్ధ. ప్రకటనలకు మాత్రమే పరిమితమైన వైనం.

– ఆమదాలవలస



కూటమి పాలనలో

ఆమదాలవలస మండలం చింతాడ సచివాలయంలో ఈకేవైసీకి వేలిముద్రలు పడక ఇక్కట్లు పడుతున్న లబ్ధిదారులు



"'అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం (అమ్మఒడి స్థానంలో) అమలు చేస్తాం. జగన్ ఒక్క పిల్లాడికే అమ్మఒడితో సాయం చేశాడు. మేం విద్యార్థికి రూ.15వేల చొప్పున, ఒక తల్లికి ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం. ఇద్దరుంటే ఇద్దరికి, ముగ్గురుంటే ముగ్గురుకి, ఒకవేళ ఐదుగురుంటే ఐదుగురు పిల్లలకు తల్లికి వందనాన్ని ఇచ్చే బాధ్యతను నేను తీసుకుంటా. మీరు పిల్లలని కనండి. వారిని నేను చూసుకుంటా' – చంద్రబాబునాయుడు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ.."

నాడు గర్వపడి.. నేడు తడబడి

- ప్రభుత్వ చదువులపై కూటమి చిన్నచూపు
- ఏడాదైనా అందని తల్లికి వందనం
- టోఫెల్, ఐబీ తరగతులకు మంగళం
- విప్లవాత్మక మార్పులు చేపట్టిన వైఎస్ జగన్ సర్కారు
- అన్నింటినీ ఆపేసిన కూటమి ప్రభుత్వం



తల్లికి వందనం ఏదీ అంటే.. లెక్కలు వేస్తున్నామంటున్నారు. నాడు–నేడు ఏమైందని ప్రశ్నిస్తే విషం గక్కుతున్నారు. పోనీ టోఫెల్, ఐబీ క్లాసుల పేరెత్తితే.. పేదోళ్లకు ఆ అర్హత లేదంటున్నారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ ఆగిపోతే.. బ్లాక్ బోర్డుపై రాసుకోమంటున్నారు. విద్యా దీవెన, వసతి దీవెన ప్రస్తావిస్తే.. అదిగో ఇదిగో అంటూ విజనరీ కబుర్లు చెబుతున్నారు. ఏడాదిగా ప్రభుత్వ విద్యపై కూటమి ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి ఇది. ప్రారంభించడాలు మా విజన్‌లో లేవు.. ఆపడాలు మాత్రమే అన్నట్లు అన్ని పథకాలను ఆపేశారు. ఫలితంగా వీధి బడి మళ్లీ వెనక్కి వెళ్లిపోతోంది. ప్రభుత్వ సహకారం లేక, కార్పొరేట్ శక్తులతో పోటీ పడలేక కునారిల్లుతోంది.





ఏడాది పాలన

ఇదేనా బాబూ..

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఐదేళ్ల కిందట ఒక్కో బడిది ఒక్కో కథ. దశాబ్దాలుగా తీరని వ్యథ. అవే బ్లాక్‌బోర్డులు, అవే తరగతి భవనాలు, చాలీచాలని సదుపాయాలతో వీధుబడులు వెక్కిరింతకు గురయ్యేవి. వైఎస్ జగన్ వచ్చాక సర్కారు పాఠశాలలకు కొత్త ఊపిరి వచ్చింది. అప్పటివరకు విజనరీలుగా చెప్పుకునే వారు ఎన్నడూ ఆలోచన కూడా చేయని విధంగా విద్యార్థుల చేతికి విద్యా కానుక అందింది. వారి తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి జమైంది. పాఠశాలల రూపురేఖలు మారుస్తూ 'నాడు–నేడు' ఊపందుకుంది. మరి ఇప్పుడో.. అన్ని పథకాలకు ఎండ్ కార్డు పడింది. రోజుకో నిర్ణయం, పూటకో జీఓతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

తల్లికి వందనం ఎప్పుడో..?

ఒక తేదీ చెప్పి ఆ తేదీకి అమ్మ ఒడిని ఠంచనుగా గత ప్రభుత్వం వేసేది. ఐదేళ్లలో ఇలా రూ.1298.51 కోట్లు విద్యార్థుల ఖాతాలో జమ చేసింది. విద్యార్థులు, వారి తల్లుల ఖాతాల వివరాలు అన్నీ సర్కారు వేలి కొసనపైనే ఉన్నాయి. అయినా తల్లికి వందనం వేయడానికి కూటమికి తీరిక దొరకడం లేదు. విద్యా సంవత్సరం అయిపోయి చాలా మంది స్కూళ్లు, కాలేజీల నుంచి రిలీవైపోయినా.. ఇంకా తల్లికి వందనం ఇవ్వలేదు.



జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్(+2) వరకు 2.10లక్షల మంది చదువుతున్నారు. వీరిందరికి కలిపి మొదటి ఏడాది రూ.315 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం బాకీ పడింది.



నాడు-నేడుతో సుందరంగా కనిపిస్తున్న జి.సిగడాం మండలం కొత్తపెంట ఎంపీపీ స్కూల్

నాడు-నేడు ఆగింది చూడు

నాడు–నేడు విద్యా వ్యవస్థ ఎన్నడూ చూడని విప్లవం. దశాబ్దాల తరబడి అలాగే కునారిల్లుతున్న ప్రభుత్వ బడులకు వైఎస్ జగన్ కొత్త జీవం పోశారు. తాగునీరు, రన్నింగ్ నీరు, మరుగుదొడ్లు, ప్రహరీ, ఐఎఫ్‌పీ ప్యానల్స్, గ్రీన్‌చాక్‌బోర్డు, ఫర్నీచర్, ఫ్యాన్లు, లైట్లు, ఆర్వో ప్లాంట్లు ఇలా బడులకు కావాల్సిన అన్ని వసతులు, సౌకర్యాలను సంవృద్ధిగా కల్పించారు. నాడు-నేడు మొదటి ఫేజ్ కింద 1247 పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. రెండోఫేజ్‌లో 1096 విద్యాసంస్థలను బాగు చేశారు.

వీటిలో సగంలో ఆగిపోయిన పనులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. కేవలం లక్షల్లో నిధులు వెచ్చిస్తే అయిపోయే పనులను కూడా పూర్తి చేయడం లేదు.



నాడు-నేడుకు కూటమి సర్కారు నిధులు కేటాయించకపోవడంతో నిలిచిపోయిన శ్రీకాకుళంలోని బలగ మున్సిపల్ హైస్కూల్‌లో అదనపు తరగతిగదుల భవనం



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులు (ఫైల్)

ట్యాబ్ ఇక గతమే..

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను చేరువ చేసేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. 2022 డిసెంబర్ 21న 25,953 ట్యాబ్‌లు, 2023 డిసెంబర్ 21వ తేదీన 25,289 ట్యాబ్‌లు అందజేసింది. ఇందులో అత్యంత విలువైన బైజూస్ కంటెంట్ కలిపి ఉండేది.

కూటమి వచ్చాక డిజిటల్ విద్య ఊసే లేదు. వారు ప్రతిపక్షంలో ఉండగా 'మీరు ట్యాబ్‌లు ఇచ్చారు.. మేమొస్తే అంతకుమించి ఇస్తామ'ని గొప్పలు చెప్పినా ఒక్క ట్యాబ్ కూడా ఇవ్వలేకపోయారు.

ఇదీ జగన్ మార్క్..

పక్క చిత్రంలో తరగతి గదిని చూడండి. ఆధునిక బోధనా సదుపాయాలతో కళకళలాడుతున్న ఈ క్లాస్ రూమ్ ఏ కార్పొరేట్ పాఠశాలలోనిదో కాదండోయ్. మెళియాపుట్టి మండలంలోని అత్యంత మారుమూల గిరిజన గ్రామంలోనిది. ఆ ఊరి పేరు నేలబొంతు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యావిప్లవానికి ఎలా నాంది పలికారో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. ఇలా అభివృద్ధి చేసినవి ఎన్నో.. – ఎల్ఎన్ పేట



ఆధునిక బోధనా సదుపాయాలతో నేలబొంతు పాఠశాల తరగతి గది

రుచి కోల్పోయిన 'గోరు ముద్ద'



అప్పటివరకు రుచీపచీ లేకుండా సాగిన మధ్యాహ్న భోజన పథకానికి వైఎస్ జగన్ సర్కారు కొత్త హంగులు అద్దింది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక బడుల్లో వంద శాతం మంది భోజనాలు చేయడం మొదలుపెట్టారు. మెనూ మార్చడంతో పాటు శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లోని బడులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాలు ఏర్పాటు చేశారు. రాగిమాల్ట్, చిక్కీలను పిల్లల కోసం తీసుకువచ్చారు.

కూటమి అధికారంలోకి వచ్చాక గోరు ముద్ద రుచి కోల్పోయింది. భారీగా పెరిగిన నిత్యావసరాల రేట్లు, కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెట్టడం వంటి కారణాలు, మార్చేసిన నాసిరకమైన మెనూతో మొదటి ఏడాదిలోనే మధ్యాహ్న భోజనం అధ్వానంగా మారింది.



అందని దీవెన..



డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ, ఇతర ఉన్నత, వృత్తి విద్యాకోర్సుల కోసం జగనన్న విద్యాదీవెన పథకాన్ని తీసుకొచ్చారు. ఐదేళ్లలో 65వేల మంది విద్యార్థులకు విద్యాదీవెన కింద రూ.388.28 కోట్లు, వసతి దీవెన కింద రూ.163.02 కోట్లు, విదేశీ విద్యాదీవెన కింద రూ.67.80 కోట్లు చెల్లించింది.

ప్రభుత్వ మారాక వారి ఖాతాల్లో రూపాయి కూడా పడలేదు. దాదాపు 65వేల మంది విద్యార్థుల పరిస్థితి అయోమయంగా తయారైంది. ఫీజులు కట్టాలని కళాశాలల యాజమాన్యాలు సతాయిస్తున్నాయి.

తల్లికి వందనం ఇంకా ఇవ్వలేదు..



కూటమి ప్రభుత్వ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలుంటే వారిందరికీ చెరో రూ.15వేలు చొప్పున అందజేస్తామని చెప్పారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు ఇంటర్, మరొకరు 9వ తరగతి చదువుతున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఇప్పటివరకు తల్లికి వందనం ఇవ్వలేదు. – జి.హేమలత, శ్రీకాకుళం

ఇంటర్ రిలీవ్ అయ్యాము.. మేం నష్టపోవడమేనా ?



మాది ఎచ్చెర్ల మండలం జాలారి కొయ్యాం గ్రామం. మాది నిరుపేద కుటుంబం. నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాను. ఇంటర్ సెకెండియర్ పరీక్షలు రాశాను. కూటమి ప్రభుత్వం ఇస్తామన్న తల్లికి వందనం పథకం ఇవ్వలేదు. మేము నష్టపోవాల్సిందేనా? – ఎం.పుణ్యవతి, ఇంటర్ సెకెండియర్

కాలేజీలు ఒత్తిడి చేస్తున్నాయి..



శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ చదివాను. మాకు రావాల్సిన విద్యాదీవెన మొత్తం సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాము. కాలేజీల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు, పేరెంట్స్‌కు ఫోన్‌కాల్స్ రావడంతో బయట అప్పుచేసి ఫీజులు చెల్లించాల్సి వచ్చింది. – పి.పూజిత, డిగ్రీ విద్యార్థిని

నాడు-నేడు నిధులతోనే బాగు చేశాం



మా పాఠశాలలో నాడు–నేడు కింద చాలా అభివృద్ధి పనులు జరిగాయి. సుమారు రూ.40లక్షలు నిధులు మంజూర య్యాయి. ఈ నిధులతో పాఠశాల భవనాలతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాం. – ఎస్వీ రమణరావు, హెచ్‌ఎం, బ్రాహ్మణతర్లా జెడ్పీ హైస్కూల్

మెరిసేవన్నీ అక్షయ పాత్రలు కావు

- అక్షయ పాత్ర, రైస్ పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడిన ముఠా అరెస్టు
- పది మందిని రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ, డీఎస్పీలు వెల్లడి



ఇన్సులేటర్ బాక్స్‌ను చూపిస్తున్న అదనపు ఎస్పీ, డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : చూసేందుకు కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుస్తుంది.. దాన్ని తెచ్చిన వారి మాటలు వింటే అరచేతిలోనే స్వర్గం కనిపిస్తుంది. తీరా మోసపోయాక గానీ అర్థం కాదు మెరిసేవన్నీ అక్షయపాత్రలు కావని. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస సమీపంలో పురాతన అక్షయ పాత్ర, రైస్ పుల్లింగ్ అని నమ్మించి మోసం చేస్తున్న పది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ కేవీ రమణ, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద వెల్లడించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

అంతా రియల్ వ్యాపారులే..

విశాఖపట్నం మధురవాడకు చెందిన పచ్చితల రవి శంకర్(45), అతని స్నేహితుడు రుద్రరాజు వెంకట రంగరాజు (64), పెద గంట్యాడకు చెందిన కనకరాజు (40), నరసన్నపేట మండలం కిల్లాంకు చెందిన నక్కిన రఘునాథ రావు (52), తిరుపతి జిల్లా చిన్న గొట్టికల్లు మండలం చట్టివారిపాలెంకు చెందిన గట్టిక్కుల మురళీకృష్ణ (59), హైదరాబాద్‌కు చెందిన గరిక శ్రీను (36), కాకినాడ జిల్లా పిఠాపురం అగ్రహారానికి చెందిన కొండ శ్రీవెంకట నాగ సత్యనారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవారు. కరోనా కాలంలో వ్యాపారం లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించే మార్గం గురించి ఆలోచించారు. రవిశంకర్ 2016 లో రణస్థలం మండలం కొచ్చెర్లకు చెందిన పూని భద్రయ్య (33)తో కలసి రైస్ పుల్లింగ్ చేశారు. అప్పట్లో వీరిలో ఒకరిపై కొత్తూరు పీఎస్ పరిధిలో కేసు కూడా నమోదైంది. ఆ కేసులో ఎస్ఐ సస్పెండయ్యారు కూడా. మళ్లీ అదే అక్షయ పాత్ర, రైస్ పు ల్లింగ్ చేస్తే బాగుంటుందని రవిశంకర్, భద్రయ్య తో చేతులు కలిపాడు. రవిశంకర్ మధ్యవర్తిత్వంలో పూని భద్రయ్య వద్ద ఉన్న అక్షయపాత్రను రూ.25 లక్షలకు రుద్రరాజు వెంకటరంగరాజు బేరం కుదుర్చుకుని రూ. 5 లక్షలు అడ్వాన్సు ఇచ్చేందుకు ఒ ప్పుకున్నారు. నిజానికి ఇది రూ.1600కు మించదు.

పట్టుబడ్డారిలా..

ఎల్ఎన్‌పేట బొర్రంపేటకు చెందిన కుప్పిలి భాస్కరరావు సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస సమీపంలో ప్లేస్ సెట్ చేయడంతో మూడు కారుల్లో ఈ నెల 29 మధ్యాహ్నం అంతా బయల్దేరి వెళ్లారు. రవిశంకర్ వద్ద భద్రయ్య సోదరుడు పూనిరాజు డ్రైవర్ కావడంతో అతనూ వెళ్లాడు. అప్పటికే సమాచారం అందుకున్న సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతి సిబ్బందితో వెన్నెలవలస గ్రామం రిజర్వాయర్ సమీపానికి వెళ్లగా పాడుబడిన బంగ్లాలో వీరంతా చేరి క్రయ విక్రయాలు జరుపుతూ కనిపించడంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో ఆమదాలవలస సీఐ సత్యనారాయణ విచారణ చేపట్టారు. రూ. 25 లక్షలకు కొన్న అక్షయపాత్రను మరొకరికి రూ. 50 లక్షలకు అమ్మేందుకు సిద్ధమైనట్లు విచారణలో తేలింది.

మభ్యపెట్టి..

ఈ అక్షయ పాత్ర సాధారణమైనది కాదని, పిడుగు పడినా, హైవోల్టేజీ విద్యుత్ కాంతులకైనా, సెల్‌ఫోన్ ఫ్లాష్ పడినా పనిచేయదని, అత్యధిక వేడిమిని కాయదని, దాన్ని ఉంచేందుకు ఇన్సులేటర్ అనే బాక్స్‌ను సైతం చూపించి మభ్యపెట్టడం వీరి నైజం. ఆ బాక్సు ఎంత వేడిమినైనా తట్టుకుంటుందని మాయమాటలు చెబుతారు.

ప్రతిభకు ప్రశంసలు..

మీడియా సమావేశం అనంతరం నిందితుల వద్ద నుంచి 3 కార్లు, రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. కేసును డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో చాకచక్యంగా ఛేదించిన ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్ఐ హైమావతి, సిబ్బంది జనార్ధనరావు, తిరుపతిరావు, గణపతిరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు, నర్సింగరావు, సంతోషిలను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగంలో

సిక్కోలుకు పెద్ద పీట

- ఐదుగురికి చోటు కల్పించిన అధిష్టానం
- రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్
- కార్యదర్శిగా యర్రా చక్రవర్తి
- సంయుక్త కార్యదర్శులుగా నక్క రామరాజు, చింతు రాఘవరావు, పిన్నింటి సత్యంనాయుడు
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ రాష్ట్ర కార్యాలయం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మెంటాడ స్వరూప్ నియమితులయ్యారు. మరో నలుగురికి రాష్ట్ర యువజన విభాగంలో చోటు కల్పించారు. వీరిలో ఒకరిని రాష్ట్ర కార్యదర్శిగా, మరో ముగ్గురిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు జరిగాయి. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా పలువురు నియామకమయ్యారు.

మెంటాడ స్వరూప్‌కు సముచిత స్థానం



జిల్లా యువజన నాయకుడు మెంటాడ స్వరూప్‌కు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి గుర్తింపు ఇచ్చారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించారు. గతంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగానూ సేవలు అందించారు. తాజాగా రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు పనిచేస్తుండటంతో అధినేత గుర్తించారు. యువజన విభాగంలో నెంబర్ త్రీగా నియామకమయ్యారు.



టెక్కలి నియోజకవర్గం దేవుపురం ఎంపీటీసీగా, గతంలో సర్పంచ్‌గా పనిచేసిన యర్రా చక్రవర్తిని యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పార్టీకి విశేష సేవలు అందించడంతో సరైన గుర్తింపు లభించింది. ఈయన భార్య విశ్వశాంతి చక్రవర్తి గతంలో సందిగాం ఎంపీపీగా పనిచేశారు.



సంయుక్త కార్యదర్శిగా శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన నక్క రామరాజు నియమితులయ్యారు. గతంలో కూడా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగంలో పనిచేశారు. పార్టీ కోసం అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ రాష్ట్ర పార్టీలో నియమించారు.

నరసన్నపేట నియోజకవర్గం



పోలాకి మండలం బెలమర గ్రామానికి చెందిన చింతు రాఘవరావును యువజన విభాగం రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఆయన తొలిసారి యువజన విభాగంలో చోటు దక్కించుకున్నారు.



ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం జీఆర్‌పురం గ్రామానికి చెందిన పిన్నింటి సత్యం నాయుడును కూడా రాష్ట్ర యువజన విభాగంలో సంయుక్త కార్యదర్శిగా నియమించారు. వీరికి కూడా తొలిసారి యువజన విభాగం దక్కింది.

క్లుప్తంగా

నేడు ప్రిన్సిపల్ సెక్రటరీ రాక



సమీక్ష చేస్తున్న పీడీ సుధాకర్

నరసన్నపేట: పీఆర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ శనివారం మండలానికి వస్తున్నారని డ్వామా పీడీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సెక్రటరీ రాక సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక అధికారులతో సమీక్షించారు. నరసన్నపేట, బొరిగివలస, లుకలాంల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక అధికారులు పాల్గొనాలని సూచించారు. సమీక్షలో ఎంపీడీఓ మధుసూదనరావు, ఏపీఓ యుగంధర్‌లతో పాటు పీఆర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేపు మోడల్ డీఎస్సీ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మోడల్ డీఎస్సీ–2025 ఎస్‌జీటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.మురళీమోహన్‌రావు, డి.కేశవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న పీఆర్‌టీయూ భవనంలో ఉదయం 9 గంటలకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారు ఢీకొని పరిశ్రమ ఉద్యోగికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్ : అల్లినగరం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడి భీమవరం అరబిందో పరిశ్రమ ఉద్యోగి గాయపడ్డాడు. గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన పందిరి పాపారావు శుక్రవారం బైక్‌పై విధులకు వెళ్తుండగా అల్లినగరం కూడలి సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పాపారావును 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రిమ్స్ ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

గోవులు స్వాధీనం



ఎచ్చెర్ల: నరసన్నపేట వైపు నుంచి విశాఖపట్నం వైపు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఆవులను శుక్రవారం లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై ఎస్సై జి.లక్ష్మణరావు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్ పోలవరపు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



ప్రవళ్లిక మృతదేహం

కొత్తూరు: మహర్తాపురంలో ప్రవళ్లిక (26) అనే వివాహిత శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కొత్తూరు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం వడ్డంగి గ్రామానికి చెందిన పత్తిక సురేష్‌కు గుమ్మలక్ష్మీపురం మండలం కేదారపురం గ్రామానికి చెందిన నమ్మక ప్రవళ్లికతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. సురేష్ జియో టవర్ కంపెనీలో పనిచేస్తున్నందున కొత్తూరులోని మహర్తాపురంలో భార్యతో కలిసి నివాసముంటున్నాడు. ఎప్పటిలాగే సురేష్ శుక్రవారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ప్రవళ్లిక ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. కాగా, అల్లుడు సురేష్ అదనపు కట్నం తీసుకురావాలని నిత్యం వేధింపులకు గురిచేస్తున్నందున కుమార్తె ప్రవళ్లిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి అరుణకుమారి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, భర్త సురేష్ వేధిస్తున్నట్లు ప్రవళ్లిక గతంలోనూ బత్తిలి, గుమ్మలక్ష్మీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎచ్చెర్ల : రైతులు సాగు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి తెలిపారు. చిలకపాలెంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ బాబు మాట్లాడుతూ వరి రకాలు, తెగుళ్లను వివరించారు. అనంతరం నవధాన్యాలు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గాంధీ, వ్యవసాయ సహాయ సంచాలకులు బగ్గు రజనీ, భవానీశంకర్, కేవీకే శాస్త్రవేత్త సునీత, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ప్రకృతి మాస్టర్ ట్రైనర్ నాయుడు, విస్తరణాధికారులు జగన్మోహనరావు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

● టాస్క్‌ఫోర్స్ దెబ్బతో..

బెట్టింగ్ మాఫియా ▸ గుట్టు రట్టు

● ఏడుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు
● రూ.8,500 మాత్రమే స్వాధీనం.. మిగతాదంతా ఆన్‌లైన్‌లోనే..



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ రమణ, డీఎస్పీ వివేకానంద. వెనుకన నిందితులతో పోలీసులు



శ్రీకాకుళం క్రైమ్ : అంతర్జాతీయ, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లే వీరి ఆదాయ మార్గాలు.. క్రికెట్‌ను బలహీనతగా చేసుకున్న యువతే వీరి పెట్టుబడులు.. మెల్లిగా బెట్టింగ్ ఊబిలోకి దింపేసి వారి ద్వారా సులువుగా వచ్చే డబ్బులే వీరి విచ్చలవిడి ఖర్చులకు పచ్చ కార్పెట్లు.. షెటర్లు, రాజకీయ నాయకులతో సమస్యలు.. ఏదైనా సమస్య వస్తే అందరినీ మేనేజ్ చేసే చాకచక్యం. ఈ పరిస్థితిలో వీరిని ఎలాగైనా పకడ్బందీగా పట్టుకోవాలనే ఫిర్యాదుదారులు చాలా తెలివిగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి విషయం చేరవేశారు. దీంతో ఎస్పీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపారు. అంతే.. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దెబ్బకు జిల్లాను ఎప్పటి నుంచో పీడిస్తున్న బెట్టింగ్ మాఫియా గుట్టు రట్టు అయ్యింది. ఎట్టకేలకు శ్రీకాకుళం రూరల్ మండలం, ఎచ్చెర్ల పోలీసులు కేసును ఛేదించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న సూత్రధారులు ఎనిమిది మందిలో ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒక మహిళ కూడా ఉండటం విశేషం. మరో 15 మంది బెట్టింగ్ పాల్పడేవారిని ఇదే కేసులో సాక్షులుగా మార్చారు. దీనికి సంబంధించి వివరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద వెల్లడించారు. ఎస్పీ ఇచ్చిన సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి, ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద దాడులు చేసి కీలక బుకీలను అదుపులోకి తీసుకుని లాఅండ్‌ఆర్డర్ పోలీసులకు అప్పజెప్పినట్లు చెప్పారు. దీంతో డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో రూరల్ సీఐ సీహెచ్ పైడపునాయుడు, జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐలు రాము, సందీప్‌లు తమ సిబ్బందితో విచారణ చేపట్టారు.

బెట్టింగ్ నిర్వహణ ఇలా..

మ్యాచ్‌లు జరిగేటప్పుడు వీరి వద్ద బెట్టింగ్ కాసే ఆటగాళ్ల వివరాలను ఓ నోట్‌బుక్‌లో రాసుకుంటారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్.. వందకు రెండు రెట్లు, ఒక్కోసారి వందకు నాలుగు రెట్లు.. ఇలా అంతా ఫోన్లలోనే వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా పంపుతుంటారు. వీరి వద్ద లిక్విడ్ క్యాష్ ఉండేది తక్కువ. అంతా ఆన్‌లైన్‌లోనే లావాదేవీలే. కీలక బుకీలు మంత్రి ధనుంజయ, దుంగ మన్మథ, దయాల శ్రీనివాసరావు, పాకల కిషోర్‌లే ఆర్గనైజింగ్ చేస్తుంటారు. డబ్బంతా వివిధ మార్గాల్లో శ్రీనివాసరావు అకౌంట్‌లోకి చేరి అక్కడి నుంచి చివరికి అతని భార్య సంగీత లక్ష్మి అకౌంట్‌లో నిలుస్తుందని అదనపు ఎస్పీ వెల్లడించారు. వీరి ఖాతాలన్నీ ప్రస్తుతం వెరిఫై చేస్తున్నామని, ఎవరెవరు ఎంత పంపింది.. మొత్తంగా ఎంతన్నది విచారణ చేసి చెబుతామన్నారు. మరో వ్యక్తి, కీలక బుకీ రొక్కం తనూజ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేసుకు సహకరించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని, డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో చాకచక్యంగా ఛేదించిన సీఐలు పైడపునాయుడు, అవతారం, మిగతా సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందించారు.

ఎలా పట్టుబడ్డారంటే..

విశాఖపట్నం జిల్లా తగరపువలసలో ఉంటున్న జలుమూరు మండలం దరివాడ గ్రామానికి చెందిన దున్న మన్మథరావు, ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన పాకల కిషోర్, కర్రి రవితేజ, భైరి ఉపేంద్రలు శుక్రవారం పొన్నాడ గ్రామంలోని హనుమాన్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, బెట్టింగ్ వివరాలుండే రెండు నోట్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూరల్ మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన మంత్రి ధనుంజయరావు నివాసంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇతనితో పాటు విశాఖపట్నం పోతినమల్లయ్యపాలెంకు చెందిన దయాల శ్రీనివాసరావు, అతని భార్య సంగీత లక్ష్మి క్రికెట్ లావాదేవీలను పరిశీలిస్తూ కనిపించారు. వీరితో పాటు బెట్టింగ్ నిర్వహిస్తున్న శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన రొక్కం స్వాతినాయుడు అలియాస్ తనూజ్ రాక కోసం చూస్తూనే మరోవైపు లావాదేవీల వివరాలుండే పుస్తకాలను చూస్తున్నారు. వెంటనే పోలీసులు దాడులు జరిపి వారి వద్ద నుంచి ఐదు మొబైల్ ఫోన్లను, బెట్టింగ్ వివరాలు నమోదు చేసే పుస్తకాలు, రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ నిర్మాణంపై నోటీసులు

సాక్షి ఎఫెక్ట్...

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో పాత బస్టాండ్ వద్ద పంచాయతీ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం జరుగుతుండటంపై అధికారులు షోకాజ్ నోటీసు ఇచ్చారు. 'దర్జాగా కబ్జా' అనే శీర్షికన ఈ నెల 26న సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామకంఠంగా పిలవబడే సర్వే నెంబర్ 600లో ఈ నిర్మాణాలు జరుగుతుండటంపై శుక్రవారం ఈవోపీఆర్‌డీ కూర్మారావు, ఇన్‌చార్జి ఈవో శైలజలు పరిశీలించారు. నిర్మాణదారులు అందుబాటులో లేకపోవడంతో గోడలకు నోటీసులు అంటించారు. స్థలం డాక్యుమెంట్లు, పంచాయతీ, సుడా అనుమతుల వివరాలు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.



గోడపై నోటీసులు అతికిస్తున్న అధికారులు

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ మూల్యాంకనం

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం శనివారం నుంచి మొదలుకానుంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రంగా మూడు రోజులపాటు జరిగే ఈ స్పాట్ జూన్ రెండో తేదీ వరకు కొనసాగనుంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కోడింగ్ ప్రక్రియ శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ ప్రక్రియలో మొత్తం ఏడు పేపర్లకు సంబంధించిన 10,080 జవాబుపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు కలిపి 250 మందిని నియమించారు. జిల్లా క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య నేతృత్వంలో స్ట్రాంగ్‌రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీఖాన్, ఉపవిద్యాశాఖాధికారి విజయకుమారి డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.



స్పాట్ జరిగే శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రం ఇదే

మైనర్‌ను మోసగించిన యువకుడిపై కేసు

గార: బందరువానిపేట గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటామని నమ్మించి మోసగించిన అదే గ్రామానికి చెందిన శుక్లా అనిల్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు గార ఏఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు డీఎస్పీ సీహెచ్ వివేకానంద శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టినట్లు చెప్పారు.

కొనసాగుతున్న నిర్వాసితుల దీక్ష

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరాహార దీక్ష తొమ్మిదో రోజు కూడా కొనసాగింది. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ కోసం సొంతూరు, స్థలాలు, పొలాలు, ఇళ్లు సైతం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. 132 మందికి ప్యాకేజీలు పెండింగ్ ఉన్నాయన్నారు. సోషల్ ఎకనామిక్‌లో లేని 40 కుటుంబాలకు వెంటనే సర్వే చేసి పరిహారాలు అందజేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దీక్ష చేపట్టి తొమ్మిది రోజులు కావస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఉండటం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, దొర విజయ్ కుమార్, కిరణ్, మాధవరావు తదితరులు ఉన్నారు.



నిర్వాసితులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం

కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ

పొందూరు: మహిళా ఉద్యోగుల వీడియోలను చిత్రీకరిస్తూ వికృత చేష్టలకు పాల్పడిన పొందూరు తహశీల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావు మూడు రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇతనిపై చర్యల కోసం తహశీల్దార్ పంపిన ఫైల్ ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వద్ద ఉంది. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సన్యాసిరావును ఉద్యోగం నుంచి తొలగిస్తారనే ప్రచారం సాగుతోంది. వికృత చేష్టలకు పట్టుబడిన సన్యాసిరావుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు మహిళా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావు వికృత చేష్టలపై తహశీల్దార్ ఆర్.వెంకటేష్ సమక్షంలో ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, పొందూరు ఎస్‌ఐ వి.సత్యనారాయణలు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. కేసు దర్యాప్తులో భాగంగా కార్యాలయంలో మహిళా ఉద్యోగులతో మరికొందరితో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్స్ తీసుకున్నారు.

వృద్ధురాలిపై మనవలు దాడి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పీఎన్‌కాలనీ సమీపంలో రాయచెరువుగట్టు వద్ద తాన్ని రమణమ్మ అనే వృద్ధురాలిపై ఆమె మనవలు దాడికి పాల్పడ్డారు. రెండో పట్టణ హెచ్‌సీ శివాజీ తెలిపిన వివరాల మేరకు.. మరుగుదొడ్ల విషయంలో రమణమ్మకు, మనవలు తాన్ని సత్య, రాజేష్‌లకు గొడవలు జరుగుతున్నాయి. కోర్టును సైతం ఆశ్రయించారు. రెండు నెలల కిందట లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారు. ఇటీవల మళ్లీ గొడవలు మొదలు కావడంతో రమణమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో మనవలిద్దరూ శుక్రవారం దాడికి పాల్పడటంతో చేతికి గాయమైంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దినసరి వేతనదారులపై నివేదిక సిద్ధం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పనిచేసిన 49 మంది దినసరి వేతనదారుల సమస్యకు మరికొద్ది రోజుల్లో శాశ్వత పరిష్కారం లభించనుంది. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే దినసరి వేతనదారులను ఉద్యోగాల నుంచి తొలగించాలని నిర్ణయించిన సంగతి విదితమే. ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించేసి..అందరినీ విధుల నుంచి తప్పించాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జీతాల చెల్లింపు పూర్తి చేసి అవసరమైన సిబ్బంది సంఖ్య ఖరారు చేసేందుకు విశాఖపట్నం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్, ఆలయ ఈవో వై.భద్రాజీలతో కూడిన త్రీమెన్ కమిటీని నియమించారు. వీరు గురువారం విశాఖపట్నంలో సమావేశమై కీలక నిర్ణయాలను నివేదిక రూపంలో సిద్ధం చేశారు. దీని ప్రకారం దినసరి వేతనదారుల సంఖ్యను ఖరారు చేసిన తర్వాత రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా ఆ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నిర్ణయించారు. అరసవల్లిలో తొలిసారిగా ఔట్‌సోర్సింగ్ సేవలను రంగంలోకి దించనున్నారు. ప్రస్తుతానికి విధుల్లో ఉన్న 49 మందిలో 15 మంది మినహా మిగిలిన వారికి ఉద్వాసన తప్పదని దాదాపుగా తేలిపోయింది. ఈ అంశంపై విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ సుజాత వద్ద సాక్షి ప్రస్తావించగా.. త్రీమెన్ కమిటీ సమావేశం ముగిసిందని, ఏ విభాగంలో ఎంతమంది ఉద్యోగులు అవసరమో.. అనే విషయమై నివేదికను రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్‌కు సోమవారం పంపించనున్నట్లు స్పష్టం చేశారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని, జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, డైమండ్ పార్కు, రిమ్స్ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. 1970లో రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20 రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వ మెడలు వంచిన దశ నుంచి నేడు కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటంలో కీలక భూమిక పోషిస్తోందని చెప్పారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కొనసాగుతున్న ఉద్యమం వల్ల మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోందన్నారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

దోపిడీ, పీడన లేని సమాజమే సీఐటీయూ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆఫీస్ బేరర్ బి.మురళి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.బలరాం, కె.రాజు, గురుస్వామి, డి.యుగంధర్, మోహన్, టి.కుమారి, ఎం.అప్పన్న, ఎం.రమణ, సి.హెచ్.మీనాకుమారి, జి.రామలక్ష్మి, లక్ష్మీనారాయణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



కొల్లివలస సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో 1997–99 విద్యా సంవత్సరంలో చదివిన ఇంటర్మీడియట్ ఫస్ట్‌బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం పాతికేళ్ల తర్వాత ఒకేచోట కలిశారు. శ్రీకాకుళంలోని ఓ హోటల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకుడు, పూర్వ విద్యార్థి గోవాడ కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

– శ్రీకాకుళం రూరల్

సొమ్ము అందరిదీ..

సోకు టీడీపీ నాయకుడిది!

● దేవదాయశాఖ నిధులు, దాతల సహాయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న రామాలయం
● ఆలయ ధర్మకర్తనంటూ కరపత్రం వేయించుకున్న టీడీపీ నేత శివప్రసాద్
● మండిపడుతున్న దాతలు, గ్రామస్తులు



కాపుగోదాయవలసలో నిర్మాణం పూర్తి చేస్తుకున్న రామాలయం

సంతబొమ్మాళి: అధికార పార్టీ నాయకులు పబ్లిసిటీ కోసం దేవుడినీ వదలడం లేదు. దేవదాయ శాఖ నిధులు, దాతల సహాయంతో నిర్మాణం పూర్తిచేసుకున్న రామాలయానికి అన్నీ తానేనంటూ ఆలయ ధర్మకర్తగా టీడీపీ నాయకుడు కుత్తుమ శివప్రసాద్ కరపత్రం వేయించుకోవడంపై దాతలు, గ్రామస్తులు మండి పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం కాపుగాదాయవలసలో రూ.1,50,000 సంఘం డబ్బులతో రామాలయ నిర్మాణానికి 2015వలో పునాది వేశారు. ఆలయ నిర్మాణానికి రూ.15లక్షలు అవసరం కావడంతో సర్పంచ్ అంగ లక్ష్మితో పాటు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సహాయంతో అప్పటి దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌ను, ఎండోమెంట్ అధికారులను సంప్రదించారు. ఆలయ నిర్మాణానికి ఎండోమెంట్ నిధులు మంజూరు కావాలంటే ముందుగా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని అధికారులు తెలియజేశారు. దీంతో గ్రామానికి చెందిన వాడరేవు సింహాచలం తన సొంత డబ్బులు రూ.3లక్షలు ఎండోమెంట్ ఖాతాలో జమ చేశారు. దీంతో 2023 నవంబర్‌లో రూ.15లక్షలు ఎండోమెంట్ నిధులు (ఆర్‌సీ నె.ఏ4/476702/2023)మంజూరయ్యాయి. దీంతో స్థానిక సర్పంచ్ భర్త అంగ జనార్దన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. 70 శాతం ఆలయ నిర్మాణ పనులను సొంత డబ్బులతో పూర్తి చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

మరికొద్ది రోజుల్లో మిగతా బిల్లులు మంజూరవుతాయనగా.. ప్రభుత్వం మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు బిల్లులు చెల్లించకుండా నిలిపి వేశారు. దీంతో మిగిలిన పనులను పూర్తి చేయడానికి గ్రామస్తులే రంగంలోకి దిగారు. దీన్ని కూడా పోలీసుల సహాయంతో టీడీపీ నాయకులు నిలుపుదల చేయించారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణ బాధ్యతలు టీడీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి గ్రామంలో ఉన్న సుమారు 250 కుటుంబాలు ఒక్కొక్క కుటుంబం రూ.5వేలు చొప్పున్న విరాళంగా అందజేశారు. పలువురు దాతలు ఆలయ ధ్వజస్తంభం, రెండు కిలోల వెండి, గ్రానైట్, టైల్స్‌ను అందించారు. వీరందరి సహాయంతో గ్రామంలో రామాలయం నిర్మాణం పూర్తిచేసుకుని జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు ప్రతిష్టాపనోత్సవాలకు సిద్ధమయ్యింది.

ఇదేం తీరు?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 70 శాతం పనులు పూర్తి చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులు చేయకుండా పోలీసుల సహాయంతో అడ్డుకున్నారు. ఎండోమెంట్ నిధులతో పాటు 250 కుటుంబాలు ఇంటికి రూ. 5వేలు చొప్పున్న ఇచ్చారు. దాతల సహకారంతో నిర్మాణం పూర్తి చేసుకుంది. వీటిని విస్మరించి స్థానిక టీడీపీ నేత శివప్రసాద్ ఆలయ ధర్మకర్తగా కరపత్రాలు వేయించుకోవడం ఎంత వరకు సమంజసం? సొంత పార్టీ వాళ్లే ఛీ కొడుతున్నారు. – అంగ లక్ష్మి జనార్దన్, సర్పంచ్, కాపుగోదాయవలస



టీడీపీ నాయకుడు శివప్రసాద్ ముద్రించిన కరపత్రం

వెల్లువెత్తిన విమర్శలు..

స్థానిక టీడీపీ నాయకుడు కుత్తుమ శివకుమార్ రామాలయం నిర్మాణం తన ఖాతాలో వేసుకోవడానికి పన్నాగం పన్నాడు. ఏకంగా ఆలయ ధర్మకర్తగా తన పేరుతో కరపత్రాలను ముద్రించి గ్రామాల్లో పంపిణీ చేస్తున్నాడు. వీటిని చూసిన గ్రామస్తులు, దాతలతో పాటు సొంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. దేవున్ని కూడా ప్రచారానికి వదల్లేదంటూ సొంత పార్టీ నాయకులే బహిరంగ విమర్శిస్తున్నారు.